సాక్షి
మహబూబాబాద్
ఆదివారం | 26 | నవంబర్ | 2023



సమన్వయం, సమాచార లోపం

మంత్రి హరీశ్‌రావు జిల్లా పర్యటనలో సమన్వయం, సమాచారలోపం నెలకొంది. పట్టణంలోని రోడ్‌షోలో పాల్గొనాల్సి ఉండగా.. సమన్వయ లోపంతో గూడూరులోని ఓ విశాల ప్రదేశంలో హెలికాప్టర్ ల్యాండ్ అయింది. - 6లో▸



ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌కు కేయూ జట్లు

సౌత్ వెస్ట్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ రెజ్లింగ్ టోర్నమెంట్‌కు కేయూ జట్లను ఎంపిక చేసినట్లు ఆచార్య శ్రీనివాస్‌రావు తెలిపారు. - 6లో▸

గరిష్టం/కనిష్టం
31.5^0 / 20.1^0

వాతావరణం

జిల్లాలో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. పలుచోట్ల చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది. రాత్రి చలి తీవ్రత పెరుగుతుంది.

కాంగ్రెస్‌తో మోసపోవద్దు..



మానుకోట పట్టణంలో రోడ్ షోకు హాజరైన ప్రజలు



పాలకుర్తిలో రోడ్ షోకు హాజరైన జనం

ఆలోచించి ఓటు వేయాలి..

- బీఆర్‌ఎస్ అధికారంలోకి రాగానే గిరిజన బంధు
- కరెంట్ కావాలా.. కాంగ్రెస్ కావాలా!
- రెండు రోజుల్లో ఖాతాల్లోకి రైతుబంధు డబ్బులు
- కాంగ్రెస్, బీజేపీ సభలో అన్ని ఖాళీ కుర్చీలు
- మానుకోట రోడ్ షోలో మంత్రి తన్నీరు హరీశ్‌రావు

మహబూబాబాద్: కర్ణాటకలో రైతుల పరిస్థితి పేనం మీద నుంచి పొయ్యిలో పడట్టు అయిందని, మన రాష్ట్రంలోని రైతులు మోసపోకుండా జాగ్రత్తగా ఆలోచించి ఓటు వేయాలని రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలో మంత్రి హరీశ్‌రావు రోడ్ షో నిర్వహించారు. మధ్యాహ్నం 12.30 గంటలకు నర్సంపేట క్రాస్ రోడ్డు సెంటర్ నుంచి ప్రారంభమైన రోడ్ షో వివేకానంద సెంటర్, మదర్‌థెరిసా సెంటర్ నుంచి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఎదుట నుంచి నెహ్రూ సెంటర్ మీదుగా తహసీల్దార్ సెంటర్ వరకు సాగింది. అనంతరం మంత్రి ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో దొంగ రాత్రి కరెంట్ ఉండేదన్నారు. 24 గంటల కరెంట్ కావాలో..కాంగ్రెస్ కావాలో రైతులు అర్థం చేసుకుని కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలన్నారు. మాజీ టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రైతుబంధు దుబారా అని మాట్లాడుతున్నారని, టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి వ్యవసాయంపై అవగాహన లేక మూడు గంటల కరెంట్ చాలని మాట్లాడుతున్నారన్నారు. రైతుబంధు డబ్బులను ఎన్నికల ముందు ఆపాలని కాంగ్రెస్ చూసిందని, కానీ ఎన్నికల కమిషన్ అందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందని, మరో రెండు రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయన్నారు. కాంగ్రెస్ హయాంలో తాగునీటి కష్టాల గురించి మాట్లాడుకునే వారమని గుర్తు చేశారు. కాంగ్రెస్ సభల్లో ఖాళీ కుర్చీలు కన్పిస్తున్నాయని, కుర్చీలకు ఉపన్యాసాలు ఇస్తున్నారని బీఆర్‌ఎస్ సభకు పెద్ద ఎత్తున జనం వస్తున్నారన్నారు. భవిష్యత్ ఆలోచించే నాయకుడు కేసీఆర్ కావాలో బూతులు మాట్లాడే రేవంత్‌రెడ్డి కావాలో ప్రజలే ఆలోచించి ఓట్లు వేయాలన్నారు.

రిస్క్ వద్దు.. కారు ముద్దు..

రిస్క్ వద్దు.. కారు ముద్దు అనే నినాదంతో ముందుకు పోవాలని మంత్రి హరీశ్‌రావు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ మేనిఫెస్టోను పూర్తిగా అమలు చేస్తుందని, ఎన్నికల నేపథ్యంలో కొంత మంది రైతుల రుణమాఫీ నిలిచి పోయిందని, ఎన్నికలు పూర్తి కాగానే మాఫీ అవుతుందన్నారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి రాగానే గిరిజన బంధు అమలు చేస్తామన్నారు. మానుకోట అభ్యర్థి శంకర్ నాయక్‌ను మూడోసారి అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. మానుకోట జిల్లా కావడంతో విద్య వైద్య పరంగానే కాకుండా అన్ని రంగాల్లో అభివృద్ధి జరిగిందన్నారు. మానుకోట సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దబడిందన్నారు.

రోడ్ షో సక్సెస్..

మానుకోటలో జరిగిన మంత్రి రోడ్‌షోకు పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేశారు. రోడ్ షోతో కార్యకర్తల్లో జోష్‌ను నింపింది. ఈ కార్యక్రమంలో మంత్రి సత్యవతి రాథోడ్, ఎంపీ మాలోత్ కవిత, జెడ్పీ చైర్‌పర్సన్ ఆంగోత్ బిందు, మాజీ ఎంపీ అజ్మీర సీతారాంనాయక్, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్ మహ్మద్‌ఫరీద్, భరత్‌కుమార్‌రెడ్డి, మార్నేని వెంకన్న, కేఎస్‌ఎన్‌రెడ్డి, ముత్యం వెంకన్న, యాళ్ల మురళీధర్‌రెడ్డి, గుండా రాజశేఖర్, నాయిని రంజిత్, చిట్యాల జనార్దన్, గోగుల రాజు, అశోక్, రావిష్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు, పక్కన ఎమ్మెల్యే అభ్యర్థి బానోత్ శంకర్‌నాయక్

అభివృద్ధిని చూసి ఓటు వేయాలి..

- ఎమ్మెల్యే అభ్యర్థి బానోత్ శంకర్‌నాయక్



నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలి. మానుకోట గడ్డపై మరోసారి గులాబీ జెండాను ఎగురవేసి మూడోసారి కేసీఆర్‌ను సీఎం చేయాలి. జిల్లా కేంద్రం ఏర్పాటుతో పాటు విద్య, వైద్య పరంగా ఎంతో అభివృద్ధి చేశాం. మరోసారి ఆశీర్వదించాలని కోరారు.



అభివాదం తెలుపుతున్న మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావు

నలభై ఏళ్లలో ఎన్నో చేశాను..

- పాలకుర్తి అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావు



నలభై ఏళ్ల రాజకీయ జీవితంలో ఎన్నో కార్యక్రమాలు చేపట్టాను.. మరోసారి తనకు అవకాశం కల్పించాలని పాలకుర్తి అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావు కోరారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో సాగు, తాగు నీరు, రోడ్ల అభివృద్ధి, ఇళ్ల నిర్మాణాలు, విద్య వంటి వసతులు కల్పించాను. వల్మిడి, బమ్మెర, పాలకుర్తి గ్రామాలను పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేశాను. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాను.

కాంగ్రెస్ వద్దు.. బీఆర్‌ఎస్ ముద్దు

- దయాకర్‌రావు గెలిస్తే సీనియర్ పవర్‌ఫుల్ మంత్రి అవుతడు
- పాలకుర్తి రోడ్‌షోలో మంత్రి తన్నీరు హరీశ్‌రావు

పాలకుర్తి/పాలకుర్తిటౌన్ : 'ఎలక్షన్లు ఉన్నా లేకున్నా.. కష్టమొచ్చినా.. ఆపద సంపదకు స్పందించే.. అందరి నోట్లో నాలుకలా ఉండే దయన్న గెలవాలా.. అమెరికా నుంచి నోట్ల కట్టలతో వచ్చిన ఎన్‌ఆర్‌ఐ గెలవాలా.. మనకు కాంగ్రెస్ రిస్కు వద్దు.. ఆ పార్టీకి ఓటేసి ముప్పు తెచ్చుకోవద్దు.. కారు గుర్తు ముద్దు' అని రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. శనివారం పాలకుర్తిలో బీఆర్‌ఎస్ స్థానిక అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావు నిర్వహించిన రోడ్ షోలో ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్ స్టేట్ చైర్మన్ డాక్టర్ ఎన్.సుధాకరావుతో కలిసి పాల్గొన్నారు. చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య అమరహే అంటూ ప్రసంగం ప్రారంభించారు. కరోనా వచ్చింది.. దయన్న వచ్చిండా రాలేదా చెప్పండి.. నా దగ్గరికి వచ్చి ప్రత్యేక కోటాలో మందులు తెచ్చుకుని మిమ్మల్ని కాపాడుకున్న దయన్న.. ఏ ఊరుకెళ్లినా సీసీ రోడ్లు వేసి మట్టి అంటకుండా చేయలేదా అని ప్రజలను అడిగారు. ఇంటింటికీ తాగునీరు, కాల్వలకు సాగు నీరు వంటి మౌలిక వసతులు కల్పించిన ఎర్రబెల్లిని ఓడించేందుకు కాంగ్రెస్‌లో టికెట్ కొన్నవాళ్లు మిమ్మల్ని కొనగలరా అని ప్రశ్నించారు. ప్రియాంక, రాహుల్‌గాంధీ ఊదరగొట్టిన కర్ణాటకలో ఇచ్చిన గ్యారంటీలు అమలుకు నోచుకోలేదన్నారు. కేసీఆర్ ఆసరా పథకం రూ.2వేల నుంచి రూ.5 వేలకు పెంచుతామన్నరు.. కల్యాణలక్ష్మి, రైతు బంధు, రైతు బీమా, ఇంటింటికీ మంచినీరు, 24 గంటల కరెంటు ఇచ్చింది ఎవరో తెలుసు కదా అని జనంతో చెప్పించారు. మారుమూల గిరిజన తండాలను జీపీలుగా మార్చి స్వపరిపాలనకు శ్రీకారం చుట్టామని, దయాకర్ రావును అత్యధిక మెజారిటీతో గెలిపిస్తే ఈసారి గిరిజన బంధు ఇస్తామని, పాలకుర్తి రూపురేఖలు మరింత మారుతాయి.. అంతే కాదు ఎర్రబెల్లి సీనియర్ మంత్రి అయిడు.. పవర్ ఫుల్ ఉండాలన్నా పాలకుర్తిలో గులాబీ జెండా ఎగురవేయాలని కోరారు.

న్యూస్‌రీల్

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



గార్ల: మండలంలోని 14 గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం పీఏసీఎస్ సీఈఓ సింగు వెంకటేశ్వర్లు ప్రారంభించారు. మండలంలోని గార్ల-1, గార్ల-2, గండి, రాంపురం, చంద్రగిరి, పెద్దకిష్టాపురం, దుబ్బగూడెం, ముల్కనూరు, తదితర గ్రామాల్లో కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏ గ్రేడ్ ధాన్యం రూ.2,203, కామన్ గ్రేడ్ ధాన్యం రూ.2,183 మద్దతు ధర ప్రభుత్వం చెల్లిస్తుందని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకొని రైతులు మద్దతు ధరను పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ధరావత్ భీముడు, ఆర్.రాజేష్, హెచ్.రవి, చంద్రశేఖర్, భద్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం పంపిణీ



దంతాలపల్లి: మండలకేంద్రంలోని ప్రజా వైద్యశాలలో శనివారం క్షయవ్యాధి గ్రస్తులకు జిల్లా క్షయ వ్యాధి నివారణ విభాగం, ది బ్యారియర్స్, లయన్స్ ఆఫ్ తరుణి తొర్రూర్ ఆధ్వర్యంలో పౌష్టికాహార వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా క్షయ విభాగ ప్రోగ్రాం అధికారి మురళీధర్ మాట్లాడుతూ దంతాలపల్లి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారు సుమారు 50 మంది ఉన్నారన్నారు. వీరు ప్రతి నెల మందులతో పాటు పౌష్టికాహారం తీసుకున్నట్లయితే వ్యాధి త్వరగా నయం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు చైతన్య, ప్రాజెక్ట్ జిల్లా కోఆర్డినేటర్ విజయ్‌కుమార్, దాతలు నాగవాణి, జ్యోతి, స్రీదేవి, విజయ, సిబ్బంది పాల్గొన్నారు.

బీ ఫార్మసీ పరీక్షలు వాయిదా

కేయూ క్యాంపస్: కేయూ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలో ఈనెల 28న జరిగే బీ-ఫార్మసీ రెండో సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేసినట్లు శనివారం పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక తెలిపారు. ఎన్నికలు ఈనెల 30న ఉన్న నేపథ్యంలో ఈనెల 28న జరిగే ఆసెమిస్టర్ పరీక్షను వాయిదా వేసినట్లు.. మళ్లీ డిసెంబర్ 5న నిర్వహిస్తామని వారు తెలిపారు.

కేయూ ఎంసీఏ పరీక్షలు

కేయూ క్యాంపస్: కేయూ పరిధి ఎంసీఏ మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ (నాన్ సీబీసీఎస్ థర్డ్ ఇయర్ డ్యూరేషన్) ఎక్స్ విద్యార్థులకు డిసెంబర్ 6 నుంచి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి రాధిక శనివారం తెలిపారు. డిసెంబర్ 6, 11, 14, 18, 21 తేదీల్లో పరీక్షలు మధ్యాహ్నం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంటవరకు నిర్వహిస్తారని తెలిపారు. కాగా.. ఎంసీఏ మొదటి సంవత్సరం రెండో సెమిస్టర్ పరీక్షలు (నాన్‌సీబీసీఎస్) థర్డ్-ఇయర్ డ్యూరేషన్)ఎక్స్ విద్యార్థులకు డిసెంబర్ 6, 11, 14, 18 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గంటలవరకు నిర్వహిస్తారని వారు తెలిపారు.

జాతీయ సాహస శిబిరానికి ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు



కేయూ క్యాంపస్: జాతీయ సాహస శిబిరానికి ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల ఎంపికలను శనివారం కేయూలో నిర్వహించారు. డిసెంబర్ 23 నుంచి వచ్చే ఏడాది జనవరి 1 వరకు సాహస శిబిరాలు ఏర్పాటు చేయనున్నారు. వర్సిటీ పరిధి వివిధ కళాశాలల నుంచి కొందరు ఎంపికల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా వలంటీర్లకు 5కే రన్, దేహదారుఢ్య పరీక్షలు, కమ్యూనికేషన్ స్కిల్స్, సాంస్కృతిక ప్రతిభ తదితర అంశాల్ని పరిశీలించారు. రాష్ట్ర ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేటర్ ఠాకూర్ గీత, కేయూ ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేటర్ ఆచార్య ఈసం నారాయణ, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ఆర్.ప్రవీణ్‌కుమార్, సీహెచ్ ప్రసన్నకుమార్ పాల్గొన్నారు. జాతీయ సాహస శిబిరానికి ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లుగా ఉన్న ఐదుగురు మహిళలు, ఐదుగురు అబ్బాయిలను ఎంపిక చేసినట్లు కేయూ ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేటర్ ఆచార్య ఈసం నారాయణ తెలిపారు.

అదనపు సౌకర్యాలు కల్పించాలి



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ శశాంక


జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.శశాంక

మహబూబాబాద్: దివ్యాంగులకు ప్రత్యేక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసినందుకు అదనపు సౌకర్యాలు ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ కె.శశాంక ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో ఈనెల 30వ తేదీన పోలింగ్ సందర్భంగా పోలింగ్‌కేంద్రాల్లో ఏర్పాట్లతో పాటు పోలింగ్ విధుల నిర్వాహణ, ఈనెల 29వ తేదీన కేంద్రాలకు చేరుకుంటున్న అధికారులకు సిబ్బందికి చేపట్టాల్సిన ఏర్పాట్లపై ఎంపీడీఓలతో కలెక్టర్ సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గంలో ఐదు మోడల్ పోలింగ్ కేంద్రాలు మరో ఐదు మహిళా పోలింగ్‌కేంద్రాలతో పాటు దివ్యాంగులకు కూడా ఒక కేంద్రం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. మోడల్ కేంద్రాలను అందంగా అలంకరించాలన్నారు. సాధారణ కేంద్రాల్లో దివ్యాంగుల కోసం ర్యాంపులు వీల్‌చైర్‌లు ఇతర సౌకర్యాలు కల్పించాలన్నారు. పోలింగ్ అధికారులు తమ పోలింగ్ సామగ్రితో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి లంచ్ అయిన తర్వాతనే బయలు దేరుతారని కేంద్రాలకు చేరుకునే అధికారులకు టీతో పాటు డిన్నర్ ఇవ్వాలన్నారు. ప్రతి కేంద్రం వంద మీటర్ల మార్కు పంచాయతీ సెక్రటరీతో కలిసి ఏర్పాటు చేయాలని 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఓటర్ హెల్ప్ లైన్ బూతు ఏర్పాటు చేస్తున్నందున బీఎల్ఓతో పాటు ఆశ, ఏఎన్‌ఎంలు అందుబాటులో ఉండాలన్నారు. డోర్నకల్, మానుకోట నియోజకవర్గాలలో 345 లోకేషన్లలో 539 కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. సమీక్షలో అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, జెడ్పీ సీఈఓ రమాదేవి, అధికారులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగం నైతిక బాధ్యత

ఓటు హక్కు వినియోగించుకోవడం సమాజంలో ప్రతి ఒక్కరి నైతిక బాధ్యతగా గుర్తించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె శశాంక అన్నారు. స్థానిక ఐఎంఏ హాల్‌లో శనివారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వీప్ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటు హక్కు అనేది ప్రజాస్వామ్యంలో రాజ్యాంగం కల్పించిన గొప్ప వరమన్నారు. అనంతరం కొవ్వొత్తులతో వైద్య సిబ్బంది ర్యాలీని ప్రధాన రహదారికి చేరుకుని జంక్షన్‌లో ఓటు హక్కు నమోదుకు తమ వంతు బాధ్యతగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి సన్యాసయ్యా, ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రూపులాల్, డీఎంహెచ్ఓ అంబరీష, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా తులసి ధాత్రి నారాయణస్వామి కల్యాణం



కల్యాణంలో పాల్గొన్న భక్తులు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో తులసీ ధాత్రి నారాయణ స్వామి వారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మశ్రీ తాటిపాముల నరసింహమూర్తి మాట్లాడుతూ కార్తీక మాస స్నానం, దానం, పూజలకు చాలా ప్రీతి పాత్రమైందన్నారు. స్కాంద పురాణంలో తులసి మాహాత్యం చాలా గొప్పగా వర్ణింపబడిందని, విష్ణుమూర్తికి చాలా ప్రీతి పాత్రమైన తులసి అమ్మవారిని కార్తీక శుద్ధ ద్వాదశి (క్షీరాబ్ధి ద్వాదశి)ని పురస్కరించుకుని తులసీ ధాత్రి నారాయణ స్వామి వారి కల్యాణోత్సవం అశేష భక్త జనుల నడుమ అత్యంత భక్తి శ్రద్ధలతో జరిపామన్నారు. అర్చకులు తాటిపాముల దుర్గాప్రసాద్, మారేపల్లి కౌశిక్ శర్మ మంత్రోచ్చరణాల నడుమ సామూహిక క్షీరాబ్ధి ద్వాదశి వ్రతాలు చేయించి, తులసి దామోదర నారాయణ స్వామి కళ్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించి భక్తులకు ఆశీర్వచనాలు చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ వాసవి దేవాలయం సెక్రటరీ ఇమ్మడి రవికుమార్, చౌడవరపు మంజువాణి, చౌడవరపు సుధీర్, సుజాత, యిమ్మడి చంద్రప్రకాష్, జ్యోతి, యాదా సోమయ్య, వేమిశెట్టి సోమయ్య, సంధ్య, చౌడవరపు సుభాషిని, కామేశ్వరరావు, మురళీ, సాయి, భక్తులు పాల్గొన్నారు.

జంగ్ తెలంగాణ

ఎన్నికల దావత్



- ఉదయం ప్రచారం, సాయంత్రం సిట్టింగ్
- కులాలు, సంఘాల వారీగా మచ్చిక
- రోజురోజుకు పెరుగుతున్న దావత్‌లు
- అలా అయితేనే ప్రచారంలో మజా

సాక్షి, మహబూబాబాద్: ఎన్నికలు అంటే చుక్కా.. ముక్కా అన్న రీతిగా పలు ప్రాంతాల్లో ప్రచారం జరుగుతుంది. గతంలో పార్టీలపై అభిమానంతో ఎక్కువ మంది ప్రచారంలో పాల్గొనేవారు. కానీ ఇప్పుడు కొంత మంది మినహా.. మిగిలిన వారందరు ప్రచారానికి రావాలంటే ఖచ్చితంగా దావత్ కావాల్సిందే అంటున్నారు. దీంతో దావత్‌లు కూడా ఎన్నికల ప్రచారం, ఓట్ల సేకరణలో భాగంగా మారిందనే చర్చ.

ఉదయం ప్రచారం..సాయంత్రం దావత్‌లు..

ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రచారం చేసిన పలువురు నాయకులు, వారి వెంట వచ్చిన కార్యకర్తలకు దావత్ పెట్టందే నిద్ర పట్టదు అన్నట్లు మారింది. ఇందుకోసం మహబూబాబాద్ పట్టణంతోపాటు కేసముద్రం, గూడూరు, నెల్లికుదురు మండలాలు, డోర్నకల్ నియోజకవర్గంలోని మరిపెడ, నర్సింహులపేట, డోర్నకల్, కురవి మండల కేంద్రాల్లో దావత్‌లు నడుస్తున్నాయి. ఉదయం టిఫిన్ నుంచి మొదలుకొని, మధ్యాహ్నం భోజనం ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం కొన్ని పార్టీలు తమ కార్యాలయాల్లో వంటలు చేసి పెడుతుండగా.. మరికొందరు హోటల్స్‌ను మాట్లాడుకొని తమ నాయకులకు కార్యకర్తలకు టిఫిన్ నుంచి మొదలుకొని సాయంత్రం డిన్నర్ వరకు అన్నీ వండి పెట్టేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. అయితే ఉదయం చేసిన ప్రచారం. ప్రచార సరళి, ఓటరు నాడి మొదలైనవి ఈ రాత్రి సిట్టింగ్‌లో చర్చించుకోవడానికి అనుకూలమైన వేదికగా పలు పార్టీలు ఏర్పాటు చేసుకుంటున్నారు. అయితే సాయంత్రం మందు దొరకక పోవడం, బెల్ట్‌షాపులు కూడా మూత పడటంతో వారానికి సరిపడ మందు ఒకేసారి కొనుగోలు చేసి రోజువారీగా వినియోగించుకుంటున్నారు. మహబూబాబాద్ పట్టణంలోని వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు, నాయకులు లాడ్జీలు, ప్రైవేట్ రూమ్స్ తీసుకొని మరీ సాయంత్రం బస చేసి దావత్‌లు చేసుకుంటున్నారు.

సంఘాల సమ్మేళనాలు


ఓటర్లను తమ వైపు మళ్లించుకునేందుకు వివిధ పార్టీల అభ్యర్థులు చేయని ప్రయత్నం లేదు. ఇందులో భాగంగా మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గాల పరిధిలోని ఫంక్షన్ హాల్స్, విశాలమైన ఇళ్లల్లో సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు. పలు వృత్తిదారులు, కుల సంఘాలు, పలు వ్యాపార సంఘాల నాయకులతో మాట్లాడి వారి వారి పదిలో ఉన్న సభ్యులను సాయంత్రం ఏర్పాటు చేసిన వేదికకు రావాలని కోరుతున్నారు. అక్కడకు వచ్చే వారికి మటన్, చికెన్‌తో భోజనంతోపాటు, మందు కూడా సిద్ధం చేసి పెడుతున్నారు. అయితే ఈ వ్యవహారాలు చూసుకునేందుకు ఆయా పార్టీల్లోని కొందరు నాయకులకు బాధ్యతలు అప్పగిస్తున్నారు. ముందుగా సమావేశం పెట్టించి ఆయా సంఘాల నాయకులతో మాట్లాడించడం, తర్వాత అభ్యర్థులు లేదా వారి అనుచరులు మాట్లాడి మద్దతు తెలపాలని, అక్కడికి వచ్చిన వారితోపాటు కుటుంబ సభ్యులు, ఇతర సభ్యులకు కూడా చెప్పాలని కోరుతున్నారు. అదేవిధంగా పలు పార్టీల్లో పనిచేసి ఇప్పుడు అలిగిన వారితో కూడా దావత్‌కు పిలిచి నచ్చచెప్పడం, వారి మనస్సులో మాట వినడం, వారికి ఏం కావాలో తెలుసుకొని ఆయా అసమ్మతి నాయకులను బుజ్జగించి తమకు అనుకూలంగా తిప్పుకుంటున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే మరో రెండు రోజుల్లో ఈ దావత్‌ల సంఖ్య పెంచడం, అక్కడే డబ్బులు, మద్యం పంపిణీ చేసేలా ఏర్పాటు చేస్తున్నారు. అయితే పార్టీకోసం పాటుపడే నాయకులేమో కానీ.. పలువురు మందు బాబులకు మాత్రం ఎన్నికల పుణ్యమా అని మద్యం, మటన్, చికెన్‌తో భోజనాలు, ఖద్దర్ చొక్కా నలగకుండా అన్ని సపర్యలు రావడంతో ఈ ఎన్నికలన్నీ రోజులు అంతా సాఫీగా సాగిపోతుందని చర్చ జరుగుతుంది.

'సెమినార్' పత్రాలు పంపండి

విద్యారణ్యపురి: రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి ద్వారా నిర్వహిస్తున్న ఒక రోజు గణిత ఉపాధ్యాయుల సెమినార్‌లో భాగస్వాములు కావాలని హనుమకొండ జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ ఎండీ అబ్దుల్‌హై శనివారం ఒక ప్రకటనలో కోరారు. సమకాలీన ప్రపంచ నిర్మాణానికి బాలలకు దోహదం చేయడంలో గణితశాస్త్రం పాత్ర ప్రధానాంశంలో వివిధ క్షేత్రాల్లో బాధ్యతాయుతమైన సుస్థిరమైన ఆచరణల వ్యాప్తిలో గణిత శాస్త్రం పాత్ర, '21వ శతాబ్దపు నైపుణ్యాల కోసం గణిత విద్య, సమానత్వం, అంతర్భాగం కోసం గణిత శాస్త్రం, ఉద్భవిస్తున్న క్షేత్రాల్లో ప్రగతికోసం గణిత శాస్త్రం ద్వారా విద్యార్థుల్ని సిద్ధం చేయడం అనే నాలుగు అంశాల్లో ఏదైనా అంశంలో సెమినార్ పత్రాలు రూపొందించి డిసెంబర్ 10లోగా ఎస్‌సీఈఆర్‌టీకి పంపాల్సిందిగా డీఈఓ కోరారు. ఈసెమినార్ పత్రాలను ఉపాధ్యాయులు తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ భాషల్లో దేనిలోనైనా పంపవచ్చన్నారు. సెమినార్ పత్రాలు రూపొందించడంలో మరిన్ని వివరాలకు జిల్లా సైన్స్ అధికారి ఎస్.శ్రీనివాస్‌స్వామిని 94901 12848 నంబర్‌లో సంప్రదించాలని డీఈఓ కోరారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.చంద్రశేఖరప్రసాద్



స్టిక్కర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా జడ్జి, కలెక్టర్

మహబూబాబాద్ రూరల్: సమాజంలో ప్రతిఒక్కరు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.చంద్రశేఖరప్రసాద్ అన్నారు. భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం ఓటు హక్కు నమోదు పెంచడంలో భాగంగా చేపట్టిన స్వీప్ కార్యక్రమాన్ని శనివారం జిల్లా కేంద్రంలోని కోర్టు బార్ అసోసియేషన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి పసుపులేటి చంద్రశేఖరప్రసాద్ మాట్లాడారు. న్యాయవాదుల వద్దకు రోజుకు వంద మంది వస్తుంటారని, అందరిని చైతన్యపరచి ఓట్లు వేయించాలన్నారు. ఓటింగ్ శాతం పెంచేందుకు చేపడుతున్న కార్యక్రమాలపై జిల్లా ఎన్నికల అధికారి కృషిని ప్రశంసించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కే.శశాంక మాట్లాడుతూ ప్రధానంగా న్యాయవాదులు ప్రజలతో మమేకమై ఉండే వారని, సమాజంలో ప్రభావితం చేసే వ్యక్తులన్నారు. గ్రామీణ ప్రాంతాల కంటే పట్టణ ప్రాంతాల్లోనే ఓటు వేసేందుకు నిర్లక్ష్యం చూపుతున్నారని అందుకే స్వీప్ కార్యక్రమాలను విస్తృతంగా చేపడుతున్నామన్నారు. ఈ సందర్భంగా జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారి, స్వీప్ నోడల్ అధికారి సన్యాసయ్య ఆధ్వర్యంలో స్వీప్ ప్రచార స్టిక్కర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి సురేష్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మౌనిక, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి తిరుపతి, కోర్టు ఏఓ క్రాంతికుమార్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ దేశబోయిన వెంకటస్వామి, పోక్సో కోర్టు పీపీ కీసర పద్మాకర్ రెడ్డి, జీపీ కొంపెల్లి వెంకటయ్య, ఏజీపీ కాలేరు శ్రీనివాస్, న్యాయవాదులు మేక సురేష్ రెడ్డి, పొద్దుటూరి రవికుమార్, మామిడాల సత్యనారాయణ, తుంపిళ్ళ శ్రీనివాస్, కొండపల్లి కేశవరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవ చేసేందుకే వచ్చాం


రాయపర్తి : ప్రచారంలో మాట్లాడుతున్న యశస్వినిరెడ్డి


దేవరుప్పుల : కొత్తకాలనీ ప్రచారంలో పాల్గొన్న కృష్ణమూర్తి

- కాంగ్రెస్ పాలకుర్తి అభ్యర్థిని యశస్విని రెడ్డి
- కోలాటాలు, డప్పుచప్పుళ్లతో స్వాగతం పలికిన ప్రజలు


రాయపర్తి : ప్రచారంలో పాల్గొన్న యశస్వినిరెడ్డి

రాయపర్తి : మేం ఆస్తులు కూడబెట్టేందుకు రాజకీయాల్లోకి రాలేదని, ప్రజాసేవ చేసేందుకే వచ్చామని కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిని మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. పల్లెపల్లెకు కాంగ్రెస్ గడప గడపకు ఝాన్సమ్మ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని కిష్టాపురం, పన్యానాయక్ తండాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెకు కోలాటాలు, డప్పు చప్పుళ్లతో ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఏళ్ల తరబడి ఎమ్మెల్యేగా గెలిచిన దయాకర్ రావు చేసిన అభివృద్ధి శూన్యం అన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండే పార్టీ కాంగ్రెస్ అన్నారు. బీఆర్ఎస్ బూటకపు హామీలు ఇస్తుందన్నారు. సొంత ఇంటి కలను నెరవేర్చలేదన్నారు. యువకులకు ఉద్యోగాలు కల్పించాల్సింది పోయి బెల్ట్ షాపులు పెంచి తాగుడుకు బానిసలను చేసిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని వెంటనే ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో పాటు ఇళ్లు కట్టుకునేందుకు ఒక్కొక్కరికి రూ.5 లక్షలు, ఎస్సీ ,ఎస్టీలకు రూ.6 లక్షలు ఇవ్వనున్నట్లు తెలిపారు. గిరిజనులకు అండగా కాంగ్రెస్ నిలుస్తుందన్నారు. తనకు వచ్చే జీతాన్ని సైతం ప్రజాసేవకే వినియోగిస్తానన్నారు. కాంగ్రెస్ ప్రవేశ పెట్టిన ఆరు గ్యారంటీ స్కీంలు తప్పక అమలు అవుతాయన్నారు. కాంగ్రెస్ గెలుపు తథ్యం అన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోత్ అమ్యానాయక్,, కుందూరు గోపాల్‌రెడ్డి, సరికొండ కృష్ణారెడ్డి, రెంటాల గోవర్ధన్ రెడ్డి, మాచర్ల ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు పట్టంకడితే అధోగతే..

దేవరుప్పుల : బీఆర్ఎస్‌కు మరోసారి నమ్మి పట్టం గడితే నిరుదోగ్యులకు శాపంగా మారడమేగాక వనరులు దోపిడీ చేసి మనల్ని అధోగతి పాలు చేయడం ఖాయమని పాలకుర్తి దేవస్థాన కమిటీ మాజీ చైర్మన్ సిలువేరు కృష్ణమూర్తి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కొత్తకాలనీలో పాలకుర్తి కాంగ్రెస్ అభ్యర్థి యశస్వినిరెడ్డి గెలుపు కోసం ఇంటింటా ప్రచారం చేసి ఓటింగ్ విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కాసారపు ధర్మారెడ్డి, తోటకూరి పాండు కృష్ణ, రమేష్, రామచంద్రారెడ్డి, చెల్మారెడ్డి, మల్లయ్య పాల్గొన్నారు.

అమరుల కలలు సాకారం చేస్తున్న కేసీఆర్

- పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు


దేవరుప్పుల : కడవెండి ప్రచార సభలో మాట్లాడుతున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

దేవరుప్పుల : నాటి, నేటి తెలంగాణ సాధనలో అసువులు బాసిన అమరుల కలలు సాకారం చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి, బీఆర్ఎస్ పాలకుర్తి అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శనివారం మండలంలోని కడవెండి, ధర్మాపురంలో ఆయన ఎన్నికల ప్రచారంలో ఎర్రబెల్లికి గులాబీ శ్రేణులు సాంస్కృతిక సంప్రదాయాలు, ఆటపాటలతో ఘనస్వాగతం పలికారు. తెలంగాణ తొలి అమరుడు దొడ్డి కొమురయ్య స్మారక విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. 50 ఏళ్ల పాలన చేసిన కాంగ్రెస్ హయాంలో జరిగిన అభివృద్ధితో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన శాశ్వత ప్రాతిపదికన పనులు, రైతు సంక్షేమ పథకాలను బేరీజు వేసుకోవాలని సూచించారు. తండాల స్వయంసమృద్ధి సాధించే దిశలో స్వపరిపాలన కోసం తండాలను పంచాయతీలు చేసిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతుందన్నారు. రేలారేలా గంగవ్వ, కనకవ్వ జానపద గేయాలతో ప్రభుత్వ పథకాలపై రక్తి కట్టించారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఐ ఎర్రంరెడ్డి తిరుపతిరెడ్డి, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకుల బెల్లీనా లీనారెడ్డి, దుబ్బాక కవితరత్నాకర్‌రెడ్డి, మదార్, మహేష్, హన్మంతు, అశోక్, ఉపేందర్, కృష్ణమూర్తి, రమేష్, సాయిలు, సతీష్, లాలునాయక్, యాకయ్య, చిరంజీవి పాల్గొన్నారు.

భారీగా తరలిన గులాబీ శ్రేణులు

ఎర్రబెల్లి దయాకర్‌రావు గెలుపు కోసం తలపెట్టిన రోడ్‌షో కోసం మండల వ్యాప్తంగా గులాబీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా మండల సమన్వయకర్త పల్లా సుందర్‌రామిరెడ్డి మాట్లాడుతూ ఇంటింటా కేసీఆర్ సంక్షేమ పథకాలు పొందిన లబ్ధిదారులు ముచ్చటగా మూడోసారి సీఎం కేసీఆర్, మంత్రి దయన్నకు అత్యధిక మెజారిటీతో పట్టంగట్టడం ఖాయమన్నారు.

మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిక

కొడకండ్ల : మండలంలోని చెరువుముందు తండాకు చెందిన గిరిజనులు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సమక్షంలో శనివారం బీఆర్ఎస్‌లో చేరారు. మండల ఇన్‌చార్జ్ భానుకిరణ్‌రావు, బీఆర్ఎస్ నాయకుడు ధరావత్ వీరన్ననాయక్ ఆధ్వర్యంలో తండాకు చెందిన సోమన్న, శ్రీను, యాకూబ్, వెంకన్న, నవీన్ తదితరులు బీఆర్ఎస్‌లో చేరారు.


దేవరుప్పుల : నీర్మాల నుంచి రోడ్‌షోకు తరలుతున్న గులాబీ శ్రేణులు


కొడకండ్ల : మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన గిరిజనులు

ఎవరూ చేయని అభివృద్ధి చేశా..


టేకులపల్లి : ప్రచారంలో మాట్లాడుతున్న హరిప్రియ


బయ్యారం : ప్రచారం చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బిందు

- ఇల్లెందు బీఆర్ఎస్ అభ్యర్థి హరిప్రియ

టేకులపల్లి: గతంలో ఎవరూ చేయని విధంగా ఇల్లెందు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని, ఇది ఇలాగే కొనసాగాలంటే మరోమారు తనను భారీ మెజార్టీతో గెలిపించాలని ఇల్లెందు బీఆర్ఎస్ అభ్యర్థి బానోతు హరిప్రియ కోరారు. టేకుపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఆమె ప్రచారం చేశారు. ఈసందర్భంగా గోలియాతండా గ్రామపంచాయతీ పరిధిలోని బీ కాలనీ తండా, చుక్కాలబోడు, ముత్యాలంపాడు క్రాస్‌రోడ్ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పలువురు బీఆర్ఎస్‌లో చేరగా వారికి హరిప్రియ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భూక్యా రాధ, నాయకులు బొమ్మెర వరప్రసాద్, బోడ బాలునాయక్, ఆమెడ రేణుక, కంభంపాటి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం

ఇల్లెందురూరల్/బయ్యారం/గార్ల: బీఆర్ఎస్ ఇల్లెందు అభ్యర్థి బానోత్ హరిప్రియ విజయాన్ని కాంక్షిస్తూ ఆ పార్టీ శ్రేణులు ఇల్లెందు రూరల్ మండలంలోని సుదిమళ్లలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గడిచిన దశాబ్ద కాలంగా సీఎం కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరిస్తూ.. మరోసారి విజయం సాధిస్తే అమలు చేయబోయే పథకాలపై ప్రజలకు వివరించారు. ఈకార్యక్రమంలో కుంజ సుగుణయ్య, జక్కుల కృష్ణ, లక్ష్మీనరసింహ, ఊకే ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు. ఇక బయ్యారం మండలంలోని జగత్‌రావుపేట పంచాయతీలో బీఆర్ఎస్ అభ్యర్థి హరిప్రియ తరఫున ప్రచారం చేసిన మహబూబాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ బిందు మాట్లాడుతూ బీఆర్ఎస్‌తోనే రైతు రాజ్యం సాధ్యమవుతుందని తెలిపారు. 24 గంటలపాటు ఉచిత విద్యుత్‌తోపాటు పోడురైతులకు పట్టాలు, రైతుబంధు ఇచ్చిన ఘనత కేసీఆర్‌దేనని తెలిపారు. ఎంపీపీ మౌనిక, నాయకులు పాల్గొన్నారు. గార్ల మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్‌నాయక్ ఆధ్వర్యాన ప్రచారం చేశారు. ఎంపీపీ శివాజీచౌహాన్‌తో పాటు లింగాల ఉమేష్, శీలంశెట్టి రమేష్, ఖదీర్, రాధాకృష్ణ, భాస్కర్‌రావు, కొండల్‌రావు, ఉమేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే కొత్త మండలాలు


టేకులపల్లి : ప్రచారంలో మాట్లాడుతున్న కోరం కనకయ్య


ఇల్లెందు రూరల్ : ఇంటింటి ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

- ఇల్లెందు కాంగ్రెస్ అభ్యర్థి కనకయ్య

టేకులపల్లి: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయడం ఖాయమని.. ఆ వెంటనే ప్రజలు కోరుతున్నట్లుగా బోడు సహా ఇంకొన్నికొత్త మండలాలు ఏర్పాటుచేయిస్తామనని ఇల్లెందు కాంగ్రెస్ అభ్యర్థి కోరం కనకయ్య వెల్లడించారు. టేకులపల్లి మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఆయన ప్రచారం చేయగా నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కనకయ్య మాట్లాడుతూ బీఆర్ఎస్ నేతలకు అసత్య ప్రచారాలు చేయడం, హామీలను విస్మరించడం తప్ప ఇతర అంశాలపై శ్రద్ధ లేదని ఆరోపించారు. మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ తాగునీరు అందిస్తున్నామని చెప్పే బీఆర్ఎస్ నేతలకు గిరిజన తండాలు ఆదివాసీ గూడేల్లో ప్రజలు ఇక్కట్లు కానరావడం లేదని చెప్పారు. నాయకులు బానోత్ సుజాత, భూక్యా దేవా, గుగులోత్ రాంచందర్, ఉండేటి ప్రసాద్, పూనెం ఉమా సురేందర్, ఎదల్లపల్లి బాబు, మోకాళ్ల రమాదేవి, బోడా నిరోషా చింతా శాంతకుమారి, ఊకె రామకృష్ణ, బాణోత్ పూర్ణ, భట్టు శివ, మధురెడ్డి, పోశాలు, గణేష్ పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం

ఇల్లెందు/ఇల్లెందురూరల్/గార్ల: కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించిన ఆరు గ్యారెంటీలను వివరిస్తూ ఇల్లెందు మండలంలోని సీఎస్పీ బస్తీ గ్రామపంచాయతీ పరిధిలో నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు.కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని చెబుతూ, కనకయ్యను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పులి సైదులు, ఎంపీటీసీ పాయం కృష్ణప్రసాద్, నాయకులు కుడితి శ్రీనివాస్, పినబయిన వెంకన్న, బుచ్చిరెడ్డి, కొచ్చర్ల క్రాంతి, ఘని, నిర్మలమేరి, ఎల్లాబాయి, పాషా, అంజి, సాగర్ పాల్గొన్నారు. ఇక ఇల్లెందు కాంగ్రెస్ అభ్యర్థి కోరం కనకయ్యకు మద్దతు ప్రకటిస్తున్నట్లు భారతీయ దళిత మైనార్టీస్ విమోచన సమితి, డా.బీఆర్ అంబేద్కర్ సమాఖ్య చైర్మన్ గొల్లపల్లి దయానంద్ వెల్లడించారు. కాగా, కనకయ్య గెలుపును ఆకాంక్షిస్తూ గార్ల మండలంలోని పలు గ్రామాల్లో పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్ ఆధ్వర్యాన ప్రచారం చేశారు. నాయకులు దనియాకుల రామారావుతోపాటు శీలంశెట్టి ప్రవీణ్‌కుమార్, తాళ్లపల్లి కృష్ణగౌడ్, అజ్మీరా బస్సీలాల్, మాలోత్ వెంకట్‌లాల్, గుండా వెంకట్‌రెడ్డి, నాగేశ్వరరావు, రాముగౌడ్, రావూజీ పాల్గొన్నారు.

ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌కు కేయూ జట్లు

కేయూ క్యాంపస్ : పంజాబ్ రాష్ట్రం మొహాలిలోని చండీఘర్ యూనివర్సిటీలో ఈనెల 28 నుంచి డిసెంబర్ 1 వరకు నిర్వహించనున్న సౌత్ వెస్ట్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ రెజ్లింగ్ టోర్నమెంట్‌కు కాకతీయ యూనివర్సిటీ పురుషుల, మహిళల జట్లను ఎంపిక చేసినట్లు శనివారం కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ఆచార్య శ్రీనివాస్‌రావు తెలిపారు. రెజ్లింగ్ ఫ్రీ స్టైయిల్ పురుషుల జట్టులో వి.భరత్, ఎస్.కార్తీక్ (న్యూసైన్స్ డిగ్రీ కళాశాల, హనుమకొండ), బి.అఖిల్ (ఎల్‌బీ కాలేజి వరంగల్), ఎన్.నితిన్, బి.అఖిల్ (కేడీసీ హనుమకొండ), ఎ.భాను ప్రకాశ్ (ఐటీడబ్ల్యూ ఆర్‌డీసీ మణుగూరు), రెజ్లింగ్ గ్రీకోరోమన్ పురుషుల జట్టులో సీహెచ్. ప్రియతమ్ (న్యూసైన్స్ డిగ్రీ కాలేజి ,హనుమకొండ), కె.అఖిల్ (వాగ్దేవి డిగ్రీ కాలేజి హనుమకొండ), ఎస్‌డీ.ముబీన్ (యూఏఎస్‌సీ హనుమకొండ), జి.తిరుపతి, ఎస్.వినయ్‌కుమార్ (యూసీపీఈ కేయూ), ఎ.వినోద్ శ్రీకేవీఎస్ డిగ్రీ కాలేజీ కురవి, మహబూబాబాద్) ఉన్నారు.

సమన్వయం, సమాచారలోపం

- గూడూరులో ల్యాండ్ అయిన హరీశ్‌రావు హెలికాప్టర్

గూడూరు/మహబూబాబాద్: మంత్రి హరీశ్‌రావు జిల్లా పర్యటనలో సమన్వయం, సమాచారలోపం నెలకొంది. మహబూబాబాద్ జిల్లా మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బానోతు శంకర్‌నాయక్ గెలుపు కోసం ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు రోడ్‌షోలో పాల్గొనాల్సి ఉంది. అయితే దీనిని రద్దు చేశారు. కానీ విషయం తెలియక శనివారం ఉదయం 11.50 నిమిషాలకు గూడూరులోని విశాల ప్రదేశంలో మంత్రి హరీశ్‌రావు వచ్చిన హెలికాప్టర్ ల్యాండ్ అయింది. హెలికాప్టర్ పూర్తిగా ఆగాక, అక్కడ ఎవరూ కనిపించకపోవడంతో మంత్రి అవాక్కయ్యారు. హెలికాప్టర్ శబ్దం విన్న కొంత మంది బీఆర్ఎస్ కార్యకర్తలు, ఒక కానిస్టేబుల్ చేరుకున్నారు. మంత్రి హరీష్‌రావు అక్కడికి వచ్చిన కార్యకర్తను ఇది ఏ ఊరు అని అడిగారు. గూడూరు అనడంతో ఇక్కడ రోడ్ షో అన్నారు కదా అంటూ పీఏను అడిగారు. పీఏ కూడా ప్రోగ్రాం అప్‌డేట్ చేయకపోవడంతో మంత్రి ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతలో ఓ కార్యకర్త రాష్ట్ర నాయకుడు భీరవెల్లి భరత్‌కుమార్‌రెడ్డికి ఫోన్ కల్పి ఇవ్వడంతో గూడూరులో ప్రోగ్రాం రద్దయిన విషయం చెబుతూ, సమాచార సమన్వయ లోపం జరిగిందన్నారు. అంతలోనే ఎమ్మెల్యే అభ్యర్థి బానోతు శంకర్‌నాయక్ కుమారుడు కారులో రాగా, ఆయన కారులో బయలుదేరి అసంతృప్తిగా వెళ్లిన సంఘటన చోటు చేసుకుంది. అరగంట తరువాత హెలికాప్టర్ కూడా మానుకోటకు వెళ్లింది.

గందరగోళం..

మానుకోటలో రోడ్‌షో రూట్ మ్యాప్ సమాచారం కూడా స్పష్టంగా తెలియకపోవడంతో కొంత గందరగోళం నెలకొంది. దీంతో నర్సంపేట రోడ్డులో, పలు సెంటర్లలో కార్యకర్తలు ఉండిపోయారు. ఆ మార్గాల గుండా రోడ్డుషో సాగలేదు. పలు మార్గాల నుంచి కార్యకర్తలు చివరికి తహసీల్దార్ కార్యాలయం ఎదుటకు చేరుకున్నారు.